# వాసన

పూర్వజన్మ సంస్కారం వల్లనో, జీవితం మీద రోతవల్లనో, లేక సన్యాసంమీద మోజు చేతనో—ఒక బెస్తవాడు ఉన్నట్టుండి సన్యాసం పుచ్చుకున్నాడు. ఆలుబిడ్డలు, ఇల్లువాకిలి, అన్నీ వదిలిపెట్టి బైరాగుల్లో కలిసిపోయాడు. ప్రతి నిత్యం— తెల్లవారగానే తెప్పవేసుకొని నదిలోకి వెళ్లి పొద్దుగూకే సమయానికి చేపలతో గట్టు చేరే ఆ బెస్త వానికి ఇప్పుడు సాధు సాంగత్యం, భగవన్నామ సంకీర్తనం, పుణ్యక్షేత్ర సందర్శనం, దేశాటనం—వీటితో కాలం గడిచిపోతున్నది. అడపాదడపా ఆలోచనలు ఇంటిమీదికి సాగితే, బలవంతాన మనస్సును అదుపులో పెట్టుకొనేవాడు. బుద్ధిని నిశ్చలంగా ఉంచుకోవడానికి ప్రయత్నించేవాడు. క్రమంగా అతడు పూర్వాశ్రమాన్ని మరిచిపోసాగాడు. నాలుగు దిక్కులు నాలుగు గోడలుగా, ఆకాశమే పై కప్పుగా ఉన్న ఈ భూప్రపంచమే తన యిల్లు, మోక్షసాధనమే తన లక్ష్యం అనుకునేవాడు.

## కలువకోలను సదానంద

ఊరూరా తిరుగుతూ అతడు ఒకనాటి ఉదయం దగ్గరున్న నదికి స్నానానికి వెళ్లాడు. అక్కడ అతనికి నయనానందకరమైన దృశ్యం ఒకటి కనిపించింది. ఒక బెస్త కుర్రవాడు నదిలో ఒక తాబేలును పట్టుకున్నాడు. దాన్ని ఒడ్డుకు తెచ్చి తాబేలు చిప్పపైన చిన్న రాతితో మోదుతున్నాడు. అది చూచి సాధువు ముఖం తెల్ల కలువలా విప్పారింది. మనస్సంతా పూర్వాశ్రమం లోనికి పరుగులు తీసింది. 'పాపం—కుర్రవాడు తాబేటిని పట్టుకున్నాడు. దాన్ని చంపడమెలాగో తెలియక ఇబ్బంది పడుతున్నాడు.... అయినా తనకెందుకు? ...సర్వసంగ పరిత్యాగి! సాధువులు ఇట్టి ఐహిక విషయాలకు అతీతులు!' పిల్లవాడు తాబేటితో చాలా హైరానా పడుతున్నాడు. బైరాగి ఇక ఉండబట్టలేక—"నాయనా! అట్ల జంపితే, అది చస్తాదా?... తిరగేసికొట్టు; తిరగేసికొట్టు! అయినా నా కెందుకులే— సన్యాసిని! అయితే మాత్రం—తాబేలినట్లా కొడితే అది చస్తాదా? తిరగేసి మొత్తు. నీళ్లి చావక పోతే నన్నడుగు... అయినా నా కెందుకులే— బైరాగిని. . ."

తాబేలు చచ్చేంతవరకు బైరాగి నోరు ఆగలేదు. "అదీ! అద్గదీ! చచ్చింది! నే జెప్పలా?... సన్యాసులం మా కెందుగ్గానీ... తాబేల్ని తిరగేసి కొడ్తేగానీ చావదు. అది జెప్పకపోతే ఎట్లా?..." అంటూ స్నానానికి ఉపక్రమించాడు.

మనస్సును అదుపులో ఉంచుకో లేనివాడు సన్యాసి ఎలా అవుతాడు? ★



# ఫైలు

పరబ్రహ్మానికి ఆఫీసు వస్తువులు స్వంతానికి వాడటమంటే సరదా. ఆయన భార్య జానకమ్మకు ఇట్లాంటి పనులు నచ్చేవికావు.

"ఎందుకండీ, మనవి కాని వస్తువులు?" అంటూండేది ఆమె.

ఒకరోజు ఆమె తాను వంటలమీద, కుట్లమీద పత్రికలనుంచి చింపిన వ్యాసాలను పెట్టుకోడానికి ఒక ఫైలు కొని తెమ్మంది.

"ఆఫీసునుండి తెస్తాలే" అన్నాడతను.

"వందలా వేలా? ఒకటి కొని తెండి. పరాయి వాళ్ల వస్తువులు మన కెందుకూ?" అంది జానకమ్మ.

కాని పరబ్రహ్మం మాటే నెగ్గింది. ఆఫీసునుంచే తెచ్చాడు ఫైలు. జానకమ్మ నసుగుతూనే అందులో తన కాగితాలు పెట్టుకుంది. పరబ్రహ్మం పనిచేసేది ఒక కంపెనీలో. ఒక రోజు సాయంకాలం పరబ్రహ్మం బయలుదేరబోతుంటే మానేజరుగారినుంచి పిలుపు వచ్చింది. ఆయన ఒక ఫైలు పరబ్రహ్మానికిస్తూ, "పరబ్రహ్మం, ఇది అర్జెంటు. దీనిలోనుంచి ఈ యీ విషయాల మీద లిస్టు తయారుచేసి తేవాలి. రేపు ఉదయం పది గంటలకు డైరెక్టర్ల మీటింగు" అన్నారు.

పరబ్రహ్మం రాత్రంతా మేలుకుని తెల్లవారు జాము మూడు గంటలకు పనయ్యిందనిపించాడు. ఫైలు పడకగది అలమారులో పెట్టి నిద్రపోయాడు. రాత్రి ఆలస్యంగా పడుకున్నాడేమో తెల్లారి లేచేటప్పటికి తొమ్మిదవుతున్నది. చికాగ్గా లేచి, స్నానం, భోజనం ముగించి, బట్టలు వేసుకుని, ఫైలు సైకిలుకు కట్టి పది—అయిదు నిమిషాలకు ఆఫీసుకు చేరుకున్నాడు.

ప్యూను అతన్ని చూసి, "దొరగారు మీ ఫైలు కోసం ఎదురుచూస్తున్నారు" అన్నాడు.

ఫైలు ప్యూను చేతికిచ్చి తన జాగాలోకి వెళ్లాడు, పరబ్రహ్మం.

మీటింగు ప్రారంభమయింది. దొరగారు తన క్రింది ఉద్యోగిని ఫలానా విషయం చదివి వినిపించమన్నారు. ఆ ఉద్యోగి ఫైలు తెరిచి, "వంకాయ కూర తయారుచేయుటకు క్రొత్త పద్ధతులు" అని నాలుక కరుచుకున్నాడు.

"అదేదో అతని స్వంత కాగితమేమో, తర్వాత చూడు" అన్నాడు దొరగారు.

"బట్టలు ఉతుకుటకు మెలుకువలు" అని చదివి మళ్లీ నాలుక కరుచుకున్నాడు ఆ ఉద్యోగి.

"మేమిక్కడికి వచ్చింది బట్టలుతకటానికీ, వంకాయ కూర వండటానికి కాదు, స్వామీ" అన్నాడు ఒక డైరెక్టరు. తక్కినవాళ్లు గొల్లుమన్నారు.

ఇందులో ఏదో పొరపాటు జరిగిందని మీటింగు ఒక గంట వాయిదా వేయవలసిందని మానేజరు దీనంగా కోరుకున్నాడు. పరబ్రహ్మానికి తల వాచేలా చీవాట్లు తగిలాయి.

ఆ రోజునుంచి పరబ్రహ్మం ఆఫీసు వస్తువు లేదైనా ఇంటికితేస్తే ఒట్టు! ★

## రాంపల్లి రాజేశ్వరి

## కవీంద్రనాథ్

చిత్రం—షకీలా (విజయనగరం)

